ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 ఏప్రిల్ 2024





కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కసరత్తు

- కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశం
- ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్న అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడటంతో రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ సమీక్షిస్తూ నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపిస్తున్నారు.

కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం

ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం దగ్గరపడుతుండటంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన విషయాలను రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్ వివరించారు. ఈనెల 18న నామినేషన్ కోసం నోటిఫికేషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేరోజు నుంచే ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ స్వీకరిస్తామన్నారు. సెలవురోజు మినహా అన్ని పనిదినాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నాం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 26న స్క్రూటిని చేస్తామన్నారు. ఈనెల 29 వరకు నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్లు వేసే ఒక్కొక్క అభ్యర్థి నాలుగు సెట్ల వరకు వేయవచ్చని వారికి వివరించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన వారికి వివరించారు. ఈ నామినేషన్ల కోసం డిపాజిట్‌ను సాధారణ అభ్యర్థులకు రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు రూ.12,500 డిపాజిట్ చేయాలని కలెక్టర్ వివరించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో కానీ చలానా రూపంలో కానీ చెల్లించాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుందని తెలిపారు. రిజిస్టర్ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు మాత్రం 10 మంది ఓటర్లు ప్రతిపాదించాలని కలెక్టర్ వివరించారు. నామినేషన్ వేసేటప్పుడు పార్టీ కండువాలు, టోపీలు ధరించి కార్యాలయాలకు రావద్దని తెలిపారు.


నూతన బ్యాంక్ ఖాతా తెరవాలి

నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంక్ అకౌంట్‌ను తీసుకోవాలని ఆయన కోరారు. ఆ అకౌంట్ ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ రికార్డులు సబ్‌మిట్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు రూ.95లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్‌లోనే పేర్కొనాలని ఆయన తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.

కోటి ఆశలతో స్వాగతం

- నేడు శ్రీ క్రోధినామ ఉగాది పర్వదినం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం.. ఉగాది పచ్చడి వితరణకు ఏర్పాట్లు
- పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలకు సిద్ధమైన ప్రజలు





కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలు.. సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టే పర్వదినం ఉగాది పండుగను మంగళవారం జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శ్రీ క్రోధినామ ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా సామగ్రి అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. పండుగకు అవసరమయ్యే కొత్త దుస్తులు ఖరీదు చేసే కొనుగోలుదారులతో బట్టల వ్యాపార సముదాయాలు సందడిగా మారాయి. ఉగాది పచ్చడికి అవసరమయ్యే కొత్త బెల్లం, చింతపండు, ఇతర కిరాణ వస్తువులతోపాటు కొత్త కుండలను కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని పలుచోట్ల పూలు, పండ్ల సముదాయాలు ఏర్పాటు చేశారు. నగరంలోని నీలకంఠేశ్వర చౌరస్తా, గాంధీచౌక్, గంజ్, పెద్దబజార్, వీక్లీమార్కెట్, రైల్వేస్టేషన్, కంఠేశ్వర్, వినాయక్‌నగర్‌తోపాటు బోధన్, ఆర్మూర్ ప్రాంతాల్లో పండుగకు అవసరమయ్యే వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ఉదయం నుంచే గ్రామాల నుంచి వచ్చి మామిడి, ఉగాది పచ్చడి కోసం అయ్యే అమ్మకాలు సాగించారు. దీంతో ఈ ప్రాంతాలన్నీ అమ్మకాలు, కొనుగోళ్లతో రద్దీగా మారాయి.

- నిజామాబాద్ అర్బన్





● మార్కెట్‌లో పండుగ సామగ్రి విక్రయాలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

బీజేపీది దేవుళ్ల పేరిట రాజకీయం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 8: బీజేపీ వాళ్లు పార్లమెంట్ ఎన్నికల్లో దేవుళ్ల పేరిట రాజకీయం చేస్తున్నారని, రాములోరి అంక్షితలను గ్రామాలకు పంపి ఓట్లు అడగడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో పార్టీ బోధన్ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజలు మార్పు కోరి కేసీఆర్‌ను గద్దె దింపినట్లు దేశ ప్రజలు మోదీని సైతం గద్దె దించాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించడానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రితో పాటు సంబంధిత అధికారులతో కలిసి ఫ్యాక్టరీ సంకెళ్లను తెరిపించారన్నారు. ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్ల పేరిట రైతులను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● **మైనార్టీలకు ఇఫ్తార్ విందు**

పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌తో పాటు మత పెద్దలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



ఆమె తీరే వేరు!?

- వివాదాస్పదమవుతున్న జీసీడీవో తీరు
- ఈనెల 15తో ముగియనున్న జీసీడీవో పదవీకాలం
- అనేక ఆరోపణలు ఉన్నా.. ఏడాది పొడగించాలని లేఖపై దుమారం
- జీసీడీవోపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 8: జిల్లా విద్యాశాఖలో జీసీడీవోగా పనిచేస్తున్న అధికారిణి తీరు ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. ఆది నుంచి ఆమె తీరు పట్ల విద్యాశాఖలో ఒక చర్చ జరుగుతుండగా తాజాగా జరిగిన పరిణామాలు మరింత చర్చకు దారితీస్తున్నాయి. మూడేళ్లుగా జీసీడీవోగా పనిచేస్తున్న వనిత పదవీ కాలం ముగియనుండగా.. ఆమె పదవీకాలాన్ని పొడగించాలని కోరుతూ విద్యాశాఖ అధికారి, ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖ రాయడం విద్యాశాఖలో కలకలం సృష్టించింది. మూడేళ్లుగా జిల్లా విద్యాశాఖలో జీసీడీవోగా, సమగ్ర శిక్షా అభియాన్ ఎఫ్‌ఏవోగా పనిచేస్తున్న వనిత తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. కార్యాలయ సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరించడం అన్ని విషయాల్లోనూ తనదే పైచేయిగా ఉండాలనుకోవడం మూడేళ్లుగా సాగుతోంది. ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఆమె అవినీతిపై విద్యార్థి సంఘ నాయకులు ఇటీవల అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ మళ్లీ ఆమెను జీసీడీవోగా కొనసాగించాలని డీఈవో సిఫార్సు లేఖ రాయడం విద్యాశాఖలో కొత్త వివాదానికి కారణమైంది. వనిత పదవీకాలం ఈనెల 15తో ముగియనుండగా ఆమెను ఫారిన్ సర్వీస్ నుంచి రిలీవ్ చేసి ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలిగా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిజామాబాద్ చుట్టుపక్కల ఎక్కడ కూడా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి పోస్టు ఖాళీగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లవల్సి వస్తుందని వనిత మరో ఏడాది పాటు జీసీడీవోగా కొనసాగించాలని డీఈవో చేత సిఫార్సు లేఖ పంపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జీసీడీవోగా ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఇందల్వాయికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ప్రథమ ర్యాంకు రాగా ఆమెను జీసీడీవోగా నియమించాల్సి ఉంది. కానీ ఆమెను జీసీడీవోగా నువ్వు పనిచేయలేవని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల ఫిర్యాదు..

అనేక ఆరోపణలు ఉన్న జీసీడీవో వనితపై చర్యలు తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారి కాలయాపన చేస్తున్నారని సమగ్ర విచారణ జరిపి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మైత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కేజీబీవీలలో గత మార్చి 25 నుంచి 31 వరకు జరిగిన లావాదేవీలలో అనేక అవకతవకలు జరిగినట్లు లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ ఎఫ్‌ఏవోగా పనిచేస్తున్న వనితపై చర్యలు తీసుకోవడం లేదని వారు కలెక్టర్‌కు తెలిపారు.

పొడగింపు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి..

సెక్టోరియల్ అధికారి-5 (జీసీడీవో)గా పనిచేస్తున్న వనితను మరో ఏడాది పాటు కొనసాగించేలా జిల్లా విద్యాశాఖ అధికారి హైదరాబాద్‌కు పంపిన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఆమె స్థానంలో మరొకరిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాల పక్షాన సర్వశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్‌కు లేఖ రాసినట్లు టీఎస్‌యుటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, ఎస్సీఎస్టీయుఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జీసీడీవోగా పనిచేస్తున్న వనిత గతంలో కంజర పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ మధ్యాహ్న భోజనం విషయంలో అవినీతికి పాల్పడి సస్పెండ్ అయ్యారని అదేవిధంగా నాగేపూర్ పాఠశాలలోనూ సెలవుల మంజూరు విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వనిత పదవీకాలం పూర్తి అవుతుండగా ఆమె యొక్క ఫారిన్ సర్వీస్‌ను నిలుపుదల చేస్తూ ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలిగా పంపవల్సి ఉంటుందని కానీ అలా కాకుండా ఏడాదిపాటు కొనసాగించాలని కోరుతూ ఆమె లేఖ రాయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటనలో పేర్కొన్నాయి.

బయోసైన్స్ పరీక్షను ఉదయానికి మార్చాలి

● డీఈవో, ఎంఈవోలకు 'ట్రస్మా' వినతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 8: సమ్మెటీవ్-2 ఎనిమిదవ తరగతి బయోసైన్స్ పరీక్షను మధ్యాహ్నం నుంచి ఉదయానికి మార్చాలని ఎండల తీవ్రత ఉన్నందున దాన్ని దృష్టిలో పెట్టుకొని పరీక్ష సమయాన్ని మార్చాలని ట్రస్మా జిల్లా ప్రతినిధులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్, నిజామాబాద్ మండల విద్యాశాఖాధికారి రామారావులను కోరారు. రెండో శనివారం కార్పొరేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారని ముఖ్యంగా ఆర్మూర్‌లోని జనరల్ హాలీడే రోజుకూడా రన్ చేస్తున్నారని కావున వాటిని ఆపాలని విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని పాఠశాలలు అడ్మిషన్ల ప్రచారం నిర్వహిస్తున్నారని ముఖ్యంగా నందిపేట మండలంలో ఎక్కువగా ఉందని వాటిని ఆపాలని కోరారు. బడ్జెట్ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, ప్రధాన కార్యదర్శి అరుణ్, కోశాధికారి మధు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా అయిన గ్రామ పంచాయతీ స్థలాన్ని కాపాడాలి

● గ్రామపంచాయతీ ఎదుట కాలనీవాసుల వంటావార్పు

ముప్కాల్, ఏప్రిల్ 8: బాల్కొండ మండల కేంద్రంలోని భవానినగర్ కాలనీలో పదిశాతం కబ్జా అయిన గ్రామపంచాయతీ ల్యాండ్‌ను కాపాడాలని కాలనీవాసులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వంటా వార్పు కార్యక్రమం చేస్తూ నిరసన తెలిపారు. సర్వేనెంబర్ 1402లో అల్లాపూర్ రాజేశ్వర్ లే అవుట్ చేసి గ్రామపంచాయతీకి వదిలిన వెయ్యి గజాల ల్యాండ్‌ను కొందరు రియల్టర్లు కబ్జా చేసి విక్రయించారని, ఆ ల్యాండ్‌లో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును సైతం తొలగించి నిర్మాణం చేపడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకొని పంచాయతీ ల్యాండ్‌ను కాపాడాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు. చట్టపరంగా సమస్యను పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు మగ్గిడి విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్8: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వేదగిరి నిశిత స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖపట్నంకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయులు మధుతెలిపారు. పదో తరగతి చదువుతున్న నిశిత పలుమార్లు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. రెండు నెలల క్రితం జరిగిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వాలీబాల్ అకాడమీ హాస్టల్ సెలక్షన్‌కు ఎంపికై ంది. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినం దించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ఎరువుల షాపులను తనిఖీ చేసిన జేడీఏ



ధర్మారంలో ఎరువుల దుకా ణాలను పరిశీలిస్తున్న అధికారి వాజీద్ హుస్సేన్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 8: మండలంలోని డిచ్‌పల్లి, ధర్మారం, నడిపల్లి గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ వ్యవసాయ అధికారి రాంబాబు సోమవారం తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ... ఈ పాస్ మిషన్‌లో ఉన్న ఎరువుల బస్తాల నిల్వలు భౌతికంగా ఉన్న ఎరువుల బస్తాలను మిషన్ ద్వార ఆన్‌లైన్ చేశారు. ఎరువుల బస్తాలను రైతాంగానికి ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయాలు జరపాలని రైతులకు విక్రయించిన ఎరువులకు రశీదులు అందించాలని సూచించారు. డిచ్‌పల్లిలోని గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని జేడీఏ పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రాంబాబు, తదితరులు ఉన్నారు.

తడపాకల్‌లో బాల కవి సమ్మేళనం



బాలకవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులు

ఏర్గట్ల, ఏప్రిల్ 8: మండలంలోని తడపాకల్ గ్రామంలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ క్రోధి నామ ఉగాదిని పురస్కరించుకొని ఇందూరు బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బాల కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉగాది పండుగ గొప్పతనం, షడ్రుచులతో కూడిన పచ్చడి, ఉగాది ప్రత్యేకతను చక్కగా వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాములు, ప్రవీణ్ శర్మ, సుధాకర్, కృష్ణప్రసాద్, సుజాత, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్8: ఆర్మూర్ పట్టణ శివారులోని 63వ జాతీయ రహదారిపై పోహార్ రమేష్(55)ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. అంకాపూర్ గ్రామంలోని ఓ క్రషర్ మిషన్‌లో పని చేస్తున్న రమేష్ సైకిల్‌పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు 108అంబులెన్స్‌కు సమాచారం అందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రమేష్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

నిఘా నేత్రంలో నల్లూర్ గ్రామం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్8: ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసుకున్న నిఘా నేత్రాలను సోమవారం ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 26సీసీ కెమెరాలను గ్రామప్రజల సహకారంతో ఏర్పాటు చేసుకోవడం పట్ల గ్రామంలో 24గంటలు నిఘా ఉంటుందని ఆయన అన్నారు. గ్రామంలో ఏటువంటి సమస్య ఉన్న, కొత్త వ్యక్తులు కనిపించిన తమకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో యువత గంజాయికి అలవాటు పడకుండా తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచాలని సూచించారు.వేసవి సెలవుల్లో విద్యార్థులు డ్యా మ్‌లోకి వెళ్లకుండా చూసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ఎస్సై భాస్కరచారి,సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై శివాలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఏప్రిల్8: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 108కొబ్బరికాయలతో శివలిం గాన్ని తయారు చేసి మకుటధారణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారుతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నందీశ్వర మహరాజ్ చేతుల మీదుగా విచ్చేసిన మహిళ భక్తులందరికి కొబ్బరికాయ, కలశం అందజేశారు. ఆర్మూర్ భజన మండలి ఆధ్వర్యంలో పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుమార్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు రామాలయం, దుర్గామాత, దత్తాద్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి కొడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, రవి, కొంతం మురళీ, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాది కూలీలకు సదుపాయాలు కల్పించాలి

ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 8 : పనులు జరుగతున్న చోట ఉపాధి కూలీలకు గ్రామపంచాయతీ నుంచి నీడ నిమిత్తం టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లలాంటి తదితర సదుపాయాలు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం మండలకేంద్రం శివారులోని పల్లెచెరువులో కొనసాగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో ఆయన సందర్శించి పరిశీలించారు. పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. పనుల చోట కూలీలకు నీడ తాగునీటి తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.పనులు జరుతున్న చోట ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా కూలీలకు అవగాహన కల్పించాలని, పనుల జరిగే చోట ఏమైనా సమస్యలు ఏర్పడుతే తనకు సమాచారం అందివ్వాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్‌లు టీఏలు, సీనియర్ మేట్‌లు ఉన్నారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు!



● ప్రారంభించినట్లు వేసిన శిలాఫలకం



● ఎత్తొండలో వృథాగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

కోటగిరి,ఏప్రిల్8: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. గ్రామాలలో వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేసింది. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి 16లక్షల రూపాయలు మంజూరు చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో ఎత్తొంత, దోమలెడ్గి, కొత్తపల్లి గ్రామాలలో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలను నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కాగా ఎత్తొండలో ఏడు నెలల క్రితం ఆరోగ్య ఉప కేంద్రాన్ని అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్య ఉప కేంద్రం నాటి నుంచి నేటి వరకు ప్రారంభానికే పరిమితమైంది. ఆరోగ్య ఉప కేంద్రంలో కనీస వసతులు కల్పించకపోవడం గమనార్హం. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆరోగ్య ఉప కేంద్రం అలంకారప్రాయంగా మారింది. ఆరోగ్య ఉప కేంద్రానికి అనుకుని ఓ వ్యక్తి నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ పగిలిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆరోగ్య ఉప కేంద్రం చుట్టు సమస్యలు నెలకొని ఉండడంతో సిబ్బంది సొంత భవనంలోకి వెళ్లి వైద్య పరీక్షలు అందించే పరిస్థితి లేకుండా పోయింది. ఎత్తొండ ఉప కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆరోగ్య ఉప కేంద్రం గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతుంది. కొత్త భవనం సమస్యలపై అటు పాలకులకు, ఇటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైన ఆరోగ్య ఉపకేంద్రంలో కనీస వసతులుకల్పించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

● అవస్థలు పడుతున్న ప్రజలు

ఆరోగ్య ఉప కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి మండలంలో మలేరియా, టైఫాయిడ్, జ్వరాలతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పాటు వాక్సినేషన్, ఇతర ప్రాథమిక చికిత్సలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్య విషయాలలో స్పం దించి వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అలాగే ఆరోగ్య ఉప కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులను ఆ రోగ్య ఉప కేంద్రాలను వినియోగించే విధంగాప్రజలను అవగాహనకలిగిచే విధంగా కళాజాత ఏర్పాటు చేయాలన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు ముమ్మరం



భవనానికి పెయింటింగ్ వేస్తున్న దృశ్యం



కౌటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: వచ్చేనెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిజామాబా ద్ పార్లమెంట్ స్థాయిఎన్నికల కౌంటింగ్ కేంద్రం, డిచ్‌పల్లి 44వజాతీయ రహదరిపక్కన గల సీ ఎంసీ మెడికల్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నా రు. ఈనే పథ్యంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలోని కోరుట్ల ఆర్డీవోఆనంద్ కుమార్ ఆకస్మికంగా కౌంటింగ్ కేంద్రాన్ని, కోరుట్ల నియోజకవర్గ ఈవీయం, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్స్ భద్రపరిచే రూంలనుక్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనాలు చేశారు.గదులను శుభ్రం చేయాలని, వైయిట్ వాష్ చేయించాలని, గదుల్లో దుమ్ము తీసివేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయమై కార్మికశాఖ జిల్లా అధికారియోహన్‌తో ఫోన్ లో మాట్లాడి పలు సూచనాలు చేశారు.ఈకౌంటింగ్ కేంద్రంలోని మొదటి అంతస్థులో కోరుట్ల, బోధన్, ఆర్మూర్, నియోజక వర్గ స్థాయి కౌటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయ గా గ్రౌండ్ ఫ్లోర్‌లో నిజా మాబాద్ రూరల్, అర్బన్, బాల్కొండ, జగిత్యాల నియోజకవ్గ ఈవీయం కౌటింగ్ లకు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేస్తున్నారు.సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు.పార్కింగ్ కోసం కౌంటింగ్ కేం ద్రానికి చుట్టూ పక్క పరిసరా ప్రాం తాలలో మొరం మట్టితో చదువును చేయించారు.డిచ్‌పల్లి క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో ఎంపీ స్థాయి ఓట్ల లెక్కింపు చేయడంమూడోసారి కావడం విశేషం.

పాఠశాలల్లో తక్షణమే మరమ్మతు చేయాల్సిన పనులను గుర్తించండి

సిరికొండ ఏప్రిల్ 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో ఎంపికైన పాఠశాలల్లో తక్షణమే మరమ్మతు చేయాల్సిన పనులను గుర్తించాలని పంచాయతీ రాజ్ ఏఈ అహ్మద్ హుస్సేన్ ప్రధానోపాధ్యాయులను సూచించారు. సిరికొండ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంపీడీవో లక్ష్మి ప్రసాద్, ఏఈ అహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రభుత్వానికి పంపించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పూర్తి చేయగలిగే పనులను గుర్తించాలన్నారు.విద్యార్థులకు తాగు నీటి వసతి,తరగతి గదుల్లో విద్యుత్ సరఫరా, వాష్ రూముల(టాయిలెట్ గదుల)మరమ్మతు లాంటి పనుల గుర్తించాలన్నారు. బాలికల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ గదుల నిర్మాణం తదితర అంశాలపై అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కన్వీనర్, చైర్మన్‌లకు అవగాహన కల్పించారు.నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, తనిఖీ అధికారులు వచ్చినప్పుడు పూర్తి ఆధారాలను చూపించాలని ఏఈ అహ్మద్ హుస్సేన్ కోరారు. కార్యక్రమంలో సిరికొండ, గడ్కోల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో తక్షణమే మౌలికవసతులు కల్పన, మరమ్మత్తు పనులు ప్రభుత్వ అదేశాను సారం చేపట్టి వేసవి సెలవుల చివరిలోగా పూర్తిచేయాలని ని మండలస్థాయి అధికారులు సూచించారు. సోమవారం ఎంపీపీ కార్యాయలంలో ఎంపీడీవో అధ్యక్షతన మండంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ వీవోలతో వర్క్‌షాప్ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు తాగు నీటి వసతి, తరగతి గదుల్లో విద్యుత్ సరాఫరా, మరుగుదొడ్ల మరమ్మతు లాంటి పనులను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కన్వీనర్, చైర్మన్‌లకు అవగాహన కల్పించారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు, తనిఖీ బృందాలు వచ్చినప్పుడు చేపట్టిన పనుల వివరాలు చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ శ్రీనివాస్, ఎంఈవో ఎస్ ఆంద్రయ్య, ఏఈ పీఆర్ గట్ల శ్రీనివాసులు, మండల సూపరింటెండెంట్ మైలారం గంగాధర్ వివిధ గ్రామాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ అహ్మద్ హుస్సేన్

ముప్కాల్: ఎంపిక చేయబడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అమ్మ ప్రభుత్వ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10నాటికి మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో మండల విద్యావనరుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్కొండ, మండలంలో 15పాఠశాలలు, మెండోర మండలంలో 15 పాఠశాలలో, ముప్కాల్ మండలంలో 11 పాఠశాలలో మహిళ సమాఖ్య చైర్‌పర్సన్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా నాలుగు ప్రధాన అంశాలైన విద్యార్థులందరికి తాగునీరు సౌకర్యం, విద్యుదీకరణ, మైనర్ రిపేరింగ్, వాటర్ ఏర్పాట్లు, బాలికల ప్రత్యేక టాయిలెట్ల జూన్ 10నాటికి చేసి పూర్తి చేయాలని ఈ సమావేశంలో సూచించారు. ఇంజనీర్లు, మండల అభివృద్ధి అధికారులు, విద్యాకమిటీ పాల్గొన్నారు.

కారేపల్లి ఘాట్‌రోడ్‌లో స్కూల్ బస్సుకు ప్రమాదం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 8: పరిమితికి మించి విద్యార్థులతో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు స్టీరింగ్ రాడ్ విరిరి చెట్టును ఢీ కొట్టిన ఘటన భీమ్‌గల్ మండలంలోని కారేపల్లి గండి ఘాట్ రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ ముందు ఆందోళన నిర్వహించారు. స్కూల్ అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

● ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సు

భీమ్‌గల్ మండలంలోని కారేపల్లి గ్రామ శివారులోని ఘాట్ రోడ్డు మూలమలుపు వద్ద సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో భీమ్‌గల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిని బస్సు ప్రమాదానికి గురైంది. బస్సులో సుమారు రహత్‌నగర్, కారేపల్లి గ్రామాలకు చెందిన గిరిజన విద్యార్థులు 90 మంది విద్యార్థులు బస్సులో ఉన్నారు. స్కూల్ బస్సు ఫిట్‌నెస్ లేని కారణంగా స్టీరింగ్ రాడ్ విరిగినట్లు విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. స్కూల్ బస్సులో 40 నుంచి 50 మంది విద్యార్థులను తరలించాలి. నిబంధనలకు విరుద్ధంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం కాసులకు కక్కుర్తిపడి అత్యాశతో 90 మంది వరకు విద్యార్థులను ఒకేసారి తరలిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫీజులు మాత్రం ముక్కుపించి వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యం ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను వాడుతున్నారని వాపోయారు.

● మచ్చుకైనా కనిపించని ఆర్టీఏ తనిఖీలు

ప్రైవేట్ స్కూల్‌లలో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారులు ఎటువంటి తనిఖీలు చేయడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. సోమవారం కారేపల్లి శివారులో ప్రమాదానికి గురైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సుకు ఎటువంటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేవని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.



ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బస్సు



కారేపల్లి గండివద్ద చెట్టను ఢీకొన్న కృష్ణవేణి లెంట్ స్కూల్ బస్సు

గ్రామాల్లో తాగునీటి సమస్యరావొద్దు

● డిచ్‌పల్లి మండల స్పెషల్ ఆఫీసర్ యోహన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిచ్‌పల్లి మండల ప్రత్యేక అధికారి జిల్లా కార్మిక శాఖ అధికారి యోహన్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ధర్మేందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనాలు చేశారు.పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు.నిర్లక్ష్యం వహిస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు సేంద్రీయ ఎరువులపై అవగాహన

డొంకేశ్వర్ ఏప్రిల్ 8: రైతులు పంటలు పండించే ముందు భూసార పరీక్షలు నిర్వహించి వచ్చిన ఫలితాలకు అనుగుణంగా సేంద్రీయ ఎరువులను వినియోగించాలని గ్రోమోర్ జిల్లా మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండలంలోని అన్నారం, సిర్పూర్ గ్రామాలలో సేంద్రీయ ఎరువులపై అవగాహన కల్పించారు. రైతులు పసుపు వరి, మొక్కజొన్న, తదితర పంట వేసే ముందు రెండేళ్ళకు ఒకసారి భూసార పరీక్షలు తప్పనిసరి నిర్వహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రోమోర్ సిబ్బంది ప్రణయ్, సొసైటీ , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకత ఉంది

సంగారెడ్డి సీనియర్ సివిల్ న్యాయాధికారి డా.రాధాకృష్ణ చౌహన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 8: భారత రాజాంగానికి ఒక ప్రత్యేకత కలిగి ఉందని, ప్రపంచ దేశాల సుపరిపాలన విధానాలకు రాజ్యాంగం ద్వారా దేశంలో ఆచరిస్తున్నరని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధాకృష్ణ చౌహన్ అన్నారు. సోమవారం వర్సిటీలో కొనసాగుతున్న గ్రూప్ 1 కోచింగ్ తరగతుల కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు ప్రజాస్వామ్యం భారత రాజ్యాంగం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులతో పాటు విధులను భారత రాజ్యాంగం గురించి చర్చించారని కులాలకు మతాలకు అతీతంగా భారత రాజ్యాంగం తన విశిష్టతను కాపాడుకుంటుందన్నారు.వర్సిటీలో గ్రూప్-1కోచింగ్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, రాధ కృష్ణ చౌహన్‌ను ఘనం గా సన్మానించారు.ఈకార్యక్రమంలో కాంపిటెటీవ్ సెల్‌డైరెక్టర్ కేవీ రమణచారి, కామర్స్ డీన్ రాంబాబు,కాంట్రాక్టు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్8: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం రాత్రి పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి పోలీసులు తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని సుమారు రూ.10వేల నగదు, స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మోస్రా,ఏప్రిల్8: మోస్రా మండల కేంద్రానికి చెందిన దూపల్లి సాయిలు(48)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. అతను కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై ప్రతి చిన్న విషయంలో ఇంట్లో గొడవ పడేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు గ్రామ పంచాతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించే వాడని పేర్కొన్నారు.

బోధన్‌లో భారీ వర్షం

బోధన్‌రూరల్,ఏప్రిల్8: బోధన్‌లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ రాత్రి భారీ వర్షం జోరందుకుంది. భారీ వర్షానికి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ఈదురు గాలులతో చెట్లు పడిపోయాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యం రైతులు ఇబ్బందులు పడ్డారు.

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్

బోధన్‌రూరల్,ఏప్రిల్8: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ప్రజా భవన్ ముందు జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఆయన నిందితుడిగా ఉన్న విషయం విదితమే. ఘటన తర్వాత రాహిల్ దుబాయ్ వెళ్లాడు. అక్కడి నుండి సోమవారం హైదరాబాద్ రాగానే పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి 14రోజుల పాటు రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

రెంజల్,ఏప్రిల్8: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన బోయి చిన్న లస్మయ్య(55)అనే వ్యక్తి ఆదివారం గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో తెప్పపై నుంచి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికిన మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం అటు వైపునకు వెళ్లిన గ్రామస్థులకు చెరువులో తేలియాడుతున్న మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని జాలర్ల సహాయంతో బయటకు తీయించారు. మృతుడి కొడుకు చిన్న భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఎడపల్లి, ఏప్రిల్ 8: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికకు వివాహం కుదిరిందని, త్వరలో వివాహం జరుపబోతున్నారనే సమాచాం రావడంతో సమాచారం అందుకున్న బాల్య వివాహ నిరోధక అధికారులు సోమవారం మైనర్ బాలిక ఇంటికి వెళ్లి బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే జరిగే అనర్థాలను మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు, బాలికకు, గ్రామ పెద్దలకు వివరించారు. బాల్య వివాహంచేయడం చట్టవిరుద్ధం అనివివాహాన్ని రద్దు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయరాణి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి, ఏప్రిల్ 8: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.500 బోనస్ ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. రైతు బంధు, రైతురుణమాఫీ, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎటు పోయాయని ఆయన విమర్శించారు. అమలుకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ప్రజల కళ్లముందే ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అర్వింద్ పసుపుబోర్డు తెస్తానని గత ఎన్నికల్లో గెలిచి ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు. ఏ మొఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ఆయన ఎద్దేవా చేశారు. జీవన్‌రెడ్డికి ఓటు వేస్తే ఇక్కడి ప్రజల సమస్యలను ఎలా పట్టించుకుంటాని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి నాలుగు నెలల్లోనే 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బాజిరెడ్డి వెంట మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిజీవన్‌రెడ్డి

అర్హులకు పోడుభూముల పట్టాలు

● పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 8: అర్హులైన వారందరికీ పోడుపట్టాలు ఇప్పిస్తామని పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులకు పోడు పట్టాలు ఇప్పించి వారికి ఇందిర జలప్రభ కింద సాగునీరు అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని ఆయన దుయ్యబట్టారు. పదేళ్లలో బాజిరెడ్డి గోవర్ధన్ ఏమి అభివృద్ధి చేశారని ఆయన విమర్శించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ పసుపు బోర్డుపై రైతులకు సమాధానం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, పార్టీ సీనియర్ నాయకులు గాదారి మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8: నగరంలోని బాబన్‌సాహెబ్ పహాడ్, పేయింటర్స్ కాలనీ, వెంగల్‌రావ్‌నగర్ కాలనీలో మైనార్టీ సోదరులకు సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కేకే గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, మైనార్టీ నాయకులు అలీమ్, నవీద్ ఎక్బాల్, మోయిస్, ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్ తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల తదితరులు

జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

● ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశంలో బల్మూరి వెంకట్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 8: నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సోమవారం బైపాస్ రోడ్‌లోగల రూరల్ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వేణురాజ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్ఎస్‌యుఐ నాయకులు ఉత్సాహంగా పనిచేయాలని గత అసెంబ్లీ ఎన్నికలో పనిచేసిన విధంగా పనిచేసి జీవన్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, కేశవేణు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బల్మూరి వెంకట్ నగరంలోని పలువురి నివాసాలకు వెళ్లారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా మాజీ అధ్యక్షుడు పంచరెడ్డిచరణ్, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి విపుల్‌గౌడ్ తదితరుల నివాసాలకు వెళ్లి తేనేటి విందును ఆరగించారు.

యంచ గోదావరిలో దూకి విద్యార్థి ఆత్మహత్య

● ఎంసెట్ కోచింగ్ అర్థం కావడం లేదని మనస్తాపంతోనే..

నవీపేట, ఏప్రిల్ 8: మండలంలోని నాగేపూర్‌కు చెందిన పులి సూర్యతేజ(18)అనే విద్యార్థి సోమవారం మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ మోహన్ రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. సూర్యతేజ జిల్లా కేంద్రంలోని హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. జిల్లా కేంద్రంలోనే ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన సూర్యతేజ తమ ఎంసెట్ కోచింగ్ అర్థం కావడం లేదని తనపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెర వేర్చలేకపోతున్నానని కుటుంబ సభ్యులతో ఆవేదన చెందాడు. సోమవారం ఈ విషయంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చదువు విషయంలో ఎటువంటి ఆందోళన చెందవద్దని సూర్యతేజకు నచ్చజెప్పారు. మధ్యాహ్నం సమయంలో తండ్రి శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలు జరుగగా ఇంట్లో కుటుంబ సభ్యులతో పాటు సూర్యతేజ కూడా ఉత్సాహంగా పాల్గొన్నాడు. తండ్రికి కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపాడు. మధ్యాహ్నం సమయంలో బైక్‌పై వెళ్లిన సూర్యతేజ యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరి బ్రిడ్జిపై బైక్‌ను గమనించిన కుటుంబ సభ్యులు జాలర్ల సహాయంతో మృతదేహన్ని బయటకు తీయించారు. మృతదేహన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూర్యతేజకు తల్లి లావణ్య, 10వ తరగతి చదివే సోదరుడు ఉన్నారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అనాథ పిల్లలకు పెన్షన్ మంజూరు

ఇందల్వాయి, ఏప్రిల్ 8: జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో సీనియర్ లీగల్ జడ్జి పద్మావతి చేతుల మీదుగా ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అనాథ పిల్లలకు 3లక్షల రూపాయల విక్టిమ్ పెన్షన్ అందించడం జరిగిందని మాజీ సర్పంచ్ తేలు విజయ్‌కుమార్ తెలిపారు. గతంలో సిర్నాపల్లి గ్రామంలో ఓ భార్య భర్తని హత్య చేసి యావజీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నిందితురాలి పిల్లలు అనాథలు కావడంతో వారికి డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ నిధుల నుంచి ఈ పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగపడే విధంగా 3లక్షల రూపాయల చెక్కును అందించడం జరిగిందని తెలిపారు. అనాథ పిల్లల కోసం 3లక్షల రూపాయలు అంజూరు చేసిన డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులకు సిర్నాపల్లి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. చెక్కు అందించిన వారిలో సూపరింటెండెంట్ పురుషోత్తం, రిటైర్డ్ ఏఎస్సై జీవన్‌రావు, సిర్నాపల్లి మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ప్రముఖుల 'ఉగాది' శుభాకాంక్షలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 8 : నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖులు ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం, ప్రశాంత్ రెడ్డి, భూపతిరెడ్డి, ఎంపీలు ధర్మపురి అర్వింద్, కేఆర్ సురేష్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు శుభాలు కలగాలని, ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సవాలు నింపాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కోరారు.

'రాష్ట్రంలో బీజేపీకి 12 సీట్లు ఖాయం'

పెద్దబజార్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 సీట్లు గెలుస్తామని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 15 సీట్లు గెలుపు పొందడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కి ఓటు వేస్తే రాహుల్‌గాంధీ కుటుంబం, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగు పడతాయని అన్నారు. బీజేపీకి ఓటు వేస్తే దేశం బాగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పల్లెగంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, ARMOOR JANARDHAN (OLD NAME) H.NO. 6-44/1/A, ANKSAPUR (V), VELPOOR (M), NIZAMABAD (DIST). T.S. HAVE CHANGED MY NAME AS PASHAPU JANARDHAN S/O PASHAPU MALLAIAH (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, POCHAMPELLI SUMAN (OLD NAME) H.NO.1-35, OBLAPOR(V), SIRICILLA (M), RAJANNA SIRICILLA (DIST).T.S. HAVE CHANGED MY NAME AS KOTHAKONDA SUMAN S/O KOTHAKONDA ANJAIAH (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, ARMOOR MAHESH (OLD NAME) H.NO.6-43/3, ANKSAPUR (V), VELPOOR (M), NIZAMABAD, (DIST). T.S. HAVE CHANGED MY NAME AS PASHAPU MAHESH S/O PASHAPU JANARDHAN (NEW NAME

AJZ

CHANGE OF NAME

I, ARMOOR RAJU (OLD NAME) H.NO. 6-43/3, ANKSAPUR (V), VELPOOR (M), NIZAMABAD (DIST). T.S. HAVE CHANGED MY NAME AS PASHAPU RAJU S/O PASHAPU JANARDHAN (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, POCHAMPELLI ANJAIAH (OLD NAME) H.NO.1-39, OBLAPOR(V), SIRICILLA (M), RAJANNA SIRICILLA (DIST). T.S. HAVE CHANGED MY NAME AS KOTTAKONDA ANJAIAH S/O KOTTAKONDA NARSAIAH (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, MUNPALLY LAXMI (OLD NAME) R/O H.NO: 2-83, KOTHAARMOOR, ARMOOR, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS MUNIPALLY LAXMI (NEW NAME) W/O MUNIPALLY NARSAIAH

AJZ

CHANGE OF NAME

I, MUNPALLY NARSAIAH (OLD NAME) R/O H.NO: 2-83, KOTHA ARMOOR, ARMOOR, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS MUNIPALLY NARSAIAH (NEW NAME) S/O LIMBANNA

AJZ

CHANGE OF NAME

I, MUKKAPALLY GOLLA KAVITHA (OLD NAME) R/O HNO: 7-15/1, THORLIKONDA, JAKRANPALLY, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS MUKKAPALLI LAXMI (NEW NAME) W/O MUKKAPALLI SRINIVAS)

AJZ

CHANGE OF NAME

I, MUKKAPALLY GOLLA CHINNAIAH S/O MUKKAPALLY GOLLA MUTHENNA (OLD NAME) R/O HNO:7-15/1, THORLIKONDA, JAKRANPALLY, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS MUKKAPALLI SRINIVAS S/O MUTHENNA (NEW NAME)

AJZ

CHANGE OF NAME

I, SAMPANGI RAJU (OLD NAME) R/O H.NO: 9-21, THORLIKONDA, JAKRANPALLY, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS SAMPANGI DEVARAJ (NEW NAME) S/O THIMMANNA

AJZ

SERVICES

★ కోర్టు కేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మీకు న్యాయ సలహాలు ఇస్తాము. అనగా భూతగాదాలు, DVC, Divorce Maintenance, 498-A, Child custody etc.. GLS, L.B.NAGAR, HYD : 7893011777 AJH-002177

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి